# ఆడాళ్లూ... మీకు జోహార్లు!

"రోహిణీ! నీకో విషయం చెప్పాలి."

"ఏమిటది?"

"అదేనోయ్! మన హేమ లేదూ?"

"లేకెక్కడికి పోతుంది? హేమాసుందర్ సంగతే కదా!"

"ఆс.. తన గురించే! ఇక తన పేరులో సుందర్ లేదు. ఉత్తి హేమ అంతే!" ఏదో రహస్యం ఛేదించినట్టు అంటున్న గీత వంక ఆశ్చర్యంగా చూసింది రోహిణి.

"అవును రోహిణీ! హేమా, వాళ్లాయనా విడిపోతున్నార్ట."

"అయ్యో! అదేంటోయ్? ఎంత అన్యోన్యమైన జంటో అనుకుంటాం కదూ మనం" బాధగా అంది రోహిణి.

"పైన పటారం, లోన లొటారం. అంతా పైపైన పటాటోపం.." పనైపోయినట్టు వెళ్లి తన సీట్లో కూర్చుంది గీత.

రోహిణి ఇక నిలకడగా కూచోలేకపోయింది. మరో కొలీగ్ రమ దగ్గరకి వెళ్లింది.

"ఇది విన్నావా రమా! హేమా, వాళ్లాయనా విడిపోయారట. ప్చ్ ఏంటో? పెళ్లయి అయిదేళ్లు దాటాక ఇప్పుడీ నిర్ణయం తీసుకుంటున్నార్ట."

"నిజమేనంటావా! నాకైతే అస్సలు నమ్మబుద్ధి కావడంలేదు."

"అబద్ధం ఎందుకవుతుంది. అయినా మనకెందుకులే? ఎవరి కష్టాలు వాళ్లవి. నువ్వెవరితో చెప్పకు సుమా!" తనకు తెలిసిన విషయం చేరవేశాక అమ్మయ్య అనుకుంది రోహిణి.

ఇక రమ ప్రచారానికి బయల్దేరింది.

"రాధా! హేమాసుందర్ లేదూ! తను వాళ్లాయనకి విడాకులిచ్చేసిందట. నీకు తెలీలేదా?"

"అరే! నాకు తెలియనేలేదే! ఎప్పుడూ? ఎందుకూ?"

"ఏమోనోయ్! ఏవో గొడవలట. పైకి మంచివాడిలా కనిపిస్తాడుగానీ, అంత సహృదయుడేం కాదనుకుంటా! పాపం హేమ.. ఇదిగో! నువ్వెవరితోనూ·అనకూ!"

"ప్చ్! నాకూ బాధగానే వుంది. ఎవరితోనూ అనన్లే! అయినా దాస్తే దాగుతుందా ఏమిటి? ఎప్పటికైనా బయటపడేదే!" అంటూ లంచ్ బాక్స్ తీసుకుని క్యాంటీన్ వైపు నడిచింది రాధ.

"మా కజిన్ వాళ్లు కూడా హేమా వాళ్ల ఫ్లాట్స్‌లోనే కదా వుండేది. ఆమధ్య ఏదో బాగా గొడవైందని చెప్పింది. బహుశా ఇదేనేమో! అయినా హేమ బొత్తిగా అతని మాట వినదులే. ఏదో ఉద్యోగం చేసుకుంటూ, ఇల్లు చక్కబెట్టుకుంటే సరిపోదా! ఇప్పటికి కూడా పాటలు పాడతానంటూ ప్రోగ్రామ్స్‌కి, రిహార్సల్స్‌కి పోయింది. ఏ మగాడికైనా ఇబ్బందే కదా!" హేమ భర్త సుందర్ పైన సానుభూతి చూపించింది సుధ, రాధ చెప్పిన విషయం విని.

విషయం మరో గంటకల్లా ఆఫీసంతా పాకిపోయింది. ఓరకంట హేమని చూస్తూ గుసగుసలాడుకోసాగారు తోటి ఉద్యోగస్థులందరూ. ఇదేం గ్రహించని హేమ మాత్రం మామూలుగానే వుంది.

అయిదవుతూనే కంప్యూటర్ ముందునుంచీ లేచి బ్యాగ్ భుజాన వేసుకుంటున్న హేమ దగ్గరగా వచ్చాడు ప్రోగ్రామర్ శ్రీకర్.



"హేమా మేడమ్! ఒక్క నిమిషం మీతో మాట్లాడాలి."

"ఇప్పుడా! నాకు బస్ టైమయిపోతోంది శ్రీకర్, రేపు కుదరదా! పిల్లలు ఎదురు చూస్తుంటారు" వాచీ చూసుకుంది హేమ.

"కాదు మేడమ్. ఒక్క అయిదు నిమిషాలు అంతే!"

"సరే చెప్పు" కూర్చుంది.

"ఏంలేదు మేడమ్, మీరంటే నాకెంతో అభిమానం. నేను, స్నేహ పెళ్లి చేసుకోగలిగామంటే మీ చొరవే కారణం. మీరే గనుక తోడుగా వుండకపోతే మా లవ్ మ్యారేజ్‌కి మావాళ్లు ఒప్పుకునేవాళ్లే కాదు."

"అవుననుకో! ఆ విషయం, నన్ను ఆపి మరీ చెప్పాలంటావా!"

"అసలు విషయం అదికాదు. అసలు పెళ్లంటే ఏమిటి మేడమ్? ఒక ఉద్యోగం వదిలి మరో ఉద్యోగంలో చేరడం లాంటిదా? ఇష్టం లేకపోతే మార్చేసే డ్రస్ లాంటిదా? కాదుకదా!" ఆవేశంగా అన్నాడు శ్రీకర్.

"కాదూ!" అయోమయంగా అంది హేమ.

"అన్నీ తెలిసిన మీరే ఇలా ప్రవర్తించడం అన్యాయం మేడమ్! మీరు, మీవారూ మీ మీ భవిష్యత్తు మాత్రమే ఆలోచించారు. కానీ, ఆ పసిపిల్లల సంగతి? వాళ్లనేం చేస్తారు? ఇద్దరూ చెరొకళ్లనీ పంచుకుంటారా? ఒకరికి తల్లి, మరొకరికి తండ్రి లేని అభాగ్యుల్ని చేస్తారా? మీకెవరిచ్చారా హక్కు?"

"నువ్వేమంటున్నావో నాకు అర్థం కావడంలేదు శ్రీకర్!"

"నన్ను కాదు మేడమ్, మీవార్ని అర్థం చేసుకోండి ముందు. అపార్థాలు, అభిప్రాయ భేదాలు లేకుండా ఏ కాపురమూ వుండదు. ఆ సంగతి నాకన్నా మీకే బాగా తెలుసు. దయచేసి తొందరపడి విడిపోవాలనే నిర్ణయం తీసుకుని పిల్లల్ని అధోగతి పాలు చేశారు మీరు."

"ఏంటయ్యా శ్రీకర్? తెలివుండే మాట్లాడుతున్నావా? మేం విడిపోవడమేమిటి?" కోపంగా అంది హేమ.

"బుకాయించకండి మేడమ్, ఆఫీసులో అందరికీ తెలిసిందీ విషయం."

"మైగాడ్! అందుకేనా ఈరోజు అందరూ నన్ను చూసి తెగ చెవులు కొరుక్కుంటున్నారు. బాబూ! మేము విడిపోవడం లేదు. ప్రామిస్. సుందర్ నన్నొదిలి ఒక్కరోజు కూడా వుండలేడు. అలాంటిది మేం విడాకులు తీసుకోవడమా! నాన్సెన్స్. ఎవరో భలే సృష్టించారు" ఆశ్చర్యపోయింది హేమ.

"మరి మీరు, మీ పేరులోంచీ సుందర్‌ని తీయించేశారట. మీరే 'నేనుత్తి హేమనే, హేమాసుందర్‌ని కాదు' అని చెప్పారట" తనూ ఆశ్చర్యపోయాడు శ్రీకర్. హేమ సమాధానంతో అతనికి చెప్పలేనంత ఆనందం కూడా కలిగింది.

"ఓహ్ అదా! పొద్దున ప్రావిడెంట్ ఫండ్ లోన్‌కి అప్లయ్ చేశాను. అప్లికేషన్‌లో అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ వాళ్లు పొరపాటుగా హేమాసుందర్ అని రాశారు. కానీ, అఫీషియల్‌గా నా పేరు 'హేమ' మాత్రమే. సింగర్‌గా పాపులర్ అయింది మాత్రం 'హేమాసుందర్'గా. అందుకే అఫీషియల్ పేరుతో అప్లయ్ చేయాల్సొచ్చింది. దానికి ఇంత చిలువలు పలవలు కట్టేశారన్నమాట. మంచివాళ్లే! విడాకులిప్పించేశారు కూడా!" పకపకా నవ్వింది హేమ.

"అవునా!" ఇంకా ఆశ్చర్యంగానే వుంది శ్రీకర్‌కి.

"రూమరూ! నీకు జోహారు" అంటూ సీట్లోంచి లేచింది హేమ.

"కాదు మేడమ్! ఆడాళ్లూ...మీకు జోహార్లు!" తనూ నవ్వుతూ లేచాడు శ్రీకర్.

**-నందిరాజు పద్మలతా జయరాం**

(వనస్థలిపురం)